

పార్టీలో చేరిన మహిళా కార్యకర్తలతో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి



యువకులకు పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు తిప్పలే..

- నియోజకవర్గ ప్రజలకు మైనంపల్లి ఏం చేశారు ?
- సూరారం, భాగీర్థిపల్లి గ్రామాల్లో పద్మాదేవేందర్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం
- ఆడబిడ్డగా మీ ముందుకు వస్తున్న మరోసారి ఆశీర్వదించండి: ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, అక్టోబర్ 29: మెదక్ నియోజకవర్గ ప్రజలకు మైనంపల్లి హన్మంతరావు ఏం చేశారని బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని సూరారం, భాగీర్థిపల్లి గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూరారం, భాగీర్థిపల్లి గ్రామాల్లో బోనాలు, డప్పుచప్పుళ్లతో పటాకులు కాలుస్తూ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకం అందని ఇల్లు లేదని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంటు తిప్పలు తప్పవని, కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాయమాటలకు ప్రజలు మోసపోవద్దని సూచించారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, మూడవ సారి రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని, రైతుల సంక్షేమం కోసం రైతు బీమా, రైతుబంధు వంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతుబీమా, రైతుబంధు వంటి పలు సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆడబిడ్డగా మీ ముందుకు వస్తున్న మరోసారి ఆశీర్వదించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓడినా, గెలిచినా ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానని పేర్కొన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే కాంగ్రెస్, బీజేపీ నేతలకు ప్రజలు గుర్తుకువస్తారని, గత పదేళ్ల నుంచి నియోజకవర్గ ప్రజలకు దూరం ఉండి ఎన్నికల ముందు వచ్చి మైనంపల్లి హన్మంతరావు ఓట్లు అడుగుతే ప్రజలు ఎలా వేస్తారని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచి కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పద్మాదేవేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

### 200 మంది బీఆర్ఎస్‌లో చేరిక

మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన 200మంది యువకులు, మహిళలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన మహిళలకు, యువకులకు బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల రైతుబంధు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు రాజు, మాజీ జడ్పీటీసీ రమణ, సర్పంచులు, నీరజ, లక్ష్మణ్ దయానంద్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ అంజిరెడ్డి, ఎంపీటీసీలు అనురాధ, యాదగిరి, మాజీ సర్పంచ్‌లు చిలుక నాగరాజు, లక్ష్మణ్‌కుమార్‌గౌడ్, పవన్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ హేమ వెంకటేశం, హేమచంద్రం, దుర్గపతి, సుధాకర్‌నాయక్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భయభ్రాంతులకు గురి చేస్తే ఊరుకునే దిలేదు..



జెప్తిశివునూర్ కాశ్యతండాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చేగుంట, అక్టోబర్ 29: ఇది మల్కాజిగిరి కాదు, ప్రశాంతంగా ఉన్న మెదక్ పల్లెలో గొడవలు సృష్టిస్తే ఊరుకునేది లేదని, ఎవరూ భయపడొద్దని, మీకు నేను అండగా ఉంటానని, దాడులు చేసిన వారిపై చట్టపరంగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నార్సింగి మండల పరిధిలోని జెప్తిశివునూర్, ఎస్సీ కాలనీ కాశ్యతండా, సరోజినీ నగర్, సంకాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మైనంపల్లి వర్గీయులు కాశ్యతండాలో బీఆర్ఎస్ నాయకులపై దాడి చేసిన విషయం తెలుసుకుని అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇక్కడ ఎలాంటి గొడవలు లేవని, ఇలా గొడవలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. చట్ట పరంగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

## మున్నూరు కాపులను గుర్తించింది కేసీఆరే

శివ్వంపేట, అక్టోబర్ 29: మున్నూరు కాపులను రాజకీయంగా గుర్తించి అవకాశాలు కల్పించింది ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకులు కల్లూరి హనుమంతరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో ఆదివారం నిర్వహించనున్న 'మున్నూరు కాపుల కృతజ్ఞత సభ'కు హనుమంతరావు ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. కోకాపేటలో మున్నూరు కాపు ఆత్మగౌరవ భవనానికి ఐదు ఎకరాల స్థలం కేటాయించి రూ.5 కోట్ల నిధులు విడుదల చేయడం సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని హనుమంతరావు తెలిపారు. ఆయన వెంట సంతోశ్, రాజు తదితరులు ఉన్నారు.

## తరలివెళ్లిన శ్రేణులు

కౌల్చారం/నర్సాపూర్/చిలిపిచెడ్/శివ్వంపేట, అక్టోబర్ 29: నర్సాపూర్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ శంఖారావం సభకు రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి నర్సాపూర్, కౌల్చారం, చిలిపిచెడ్, శివ్వంపేట మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయమని బీఆర్ఎస్ యూత్ నాయకుడు రవితేజరెడ్డి అన్నారు. కౌల్చారం మండలం నుంచి ఆదివారం నర్సాపూర్‌లో జరిగిన బీఆర్ఎస్ ఎన్నికల శంఖారావం కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు సభకు భారీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. అనుకున్నదాని కంటే ఎక్కువ సంఖ్యలో కార్యకర్తలు రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సమావేశంలో ఏర్పాటు చేసిన కుర్చీలు సరిపోక కార్యకర్తలు నిల్చొని మంత్రి హరీశ్‌రావు ప్రసంగాన్ని విన్నారు. సభ దిగ్విజయం కావడం బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.

## నాడు నరకయాతన.. నేడు సుఖ ప్రయాణం

- రూ.కోటి 40 లక్షల వ్యయంతో చల్మెడలో వంతెన నిర్మాణం పూర్తి




నాడు వంతెన లేక కాలినడకన వెళ్తున్న ప్రజలు

రామాయంపేట, అక్టోబర్ 29: వానా కాలంలో నాడు పల్లె ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతానికి రావాలంటే ప్రజలు నరకయాతన పడేవారు. నేడు తెలంగాణ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ రాకతో దశాబ్దాల గ్రామీణ ప్రాంతవాసులకు కల నెరవేరింది. రామాయంపేట ఉమ్మడి మండలం చల్మెడ గ్రామానికి రోడ్డు సరిగ్గాలేక పోవడం, రాత్రి పూట వెళ్లాలంటేనే జంతువుల భయం, వర్షం వస్తే వంతెన లేక సుదూర ప్రాంతాల నుంచి కాలి నడకన వెళ్లాలి, లేదంటే అధిక సమయం ఎక్కడివారు అక్కడే ఉండే పరిస్థితి. అలాంటి దుర్భరమైన పరిస్థితి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని చల్మెడలో వంతెన నిర్మాణం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో రూ.కోటి 40 లక్షల నిధులను మంజూరు కావడంతో వంతెన నిర్మించారు. కొన్ని దశాబ్దాలుగా కాని పనిని కేవలం తెలంగాణ ప్రభుత్వంలో వంతెన ఏర్పాటు కావడంతో చల్మెడతోపాటు సమీప గ్రామస్తులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.




నేడు రూ. కోటి 40 లక్షల వ్యయంతో చల్మెడలో నిర్మించిన వంతెన



నిజాంపేట: నస్కల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలకు బీఆర్ఎస్ కండువా కప్పుతున్న ఎంపీపీ సిద్ధిరాములు

## ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

నిజాంపేట, అక్టోబర్ 29: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎంపీపీ దేశెట్టి సిద్ధిరాములు అన్నారు. ఆదివారం మండలంలోని నస్కల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు దొంతరబోయిన నర్సింహులు, శ్రీను ఎంపీపీ అధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కార్యకర్తలకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఎంపీపీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ విజయవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు నగేశ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పోలీసులు, పాల్గొన్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిణి

## రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

నర్సాపూర్, అక్టోబర్ 29: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిణి అన్నారు. ఆదివారం పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నర్సాపూర్ పోలీసుల తరుపున స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ రోహిణి ప్రియదర్శిణి సమక్షంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదాన కార్యక్రమాన్ని ఈ నెల 21 నుంచి 31 వరకు కొనసాగుతుందని, ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ షేక్ లాల్‌మదార్, ఎస్సై శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ లక్ష్మీబాబు

## పోలీసుల తనిఖీలో రూ.74 వేలు పట్టివేత

రామాయంపేట, అక్టోబర్ 29: రామాయంపేట జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో భాగంగా శనివారం రాత్రి ఓ కారులో రూ.74 వేలు లభ్యమైనట్లు రామాయంపేట సీఐ లక్ష్మీబాబు, ఎస్సై రంజిత్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో హైవేపై చెక్‌పోస్టు వద్ద ఓ వ్యక్తి కామారెడ్డి జిల్లా నుంచి హైదరాబాద్ మీదుగా రాజమండ్రికి వెళ్తున్న కారును తనిఖీ చేయగా, కారులో బిల్లులు లేకుండా రూ.74వేలు నగదు లభించిందని, సరైన పత్రాలు లేకపోవడంతో ఆ డబ్బులను మెదక్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలోని గ్రీవెన్సు సెల్‌లో అప్పగించడం జరిగిందని ఆదివారం రామాయంపేటలో సీఐ లక్ష్మీబాబు వెల్లడించారు.

## భవానీ ఆలయంలో చండీ హోమం

పెద్దశంకరంపేట, అక్టోబర్29: పెద్దశంకరంపేట భవానీమాత ఆలయంలో ఆదివారం ఆలయ ఆవరణలో చండీ హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరాపండుగ తర్వాత వచ్చే పౌర్ణమిరోజు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ ధర్మకర్త రంగరి నౌలే సంతోశ్‌కుమార్ తెలిపారు. ఆలయంలో అమ్మవారికి అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు.